క్లుప్తంగా

ఉపకరణల నిర్ధారణ శిబిరం ఏర్పాటు

దేవరపల్లి: నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు వద్ద బుధవారం ఉదయం 9 గంటలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్ తెలిపారు. సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో అలింకో సంస్థ ద్వారా అర్హులైన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందజేస్తారని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 1 నుంచి 18 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు, విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. నిర్ధారణ అనంతరం దివ్యాగులకు వీల్ ఛైర్లు, రోలెటర్లు, వినికిడి యంత్రాలు, మైడు చక్రాల కుర్చీలు, సీపీ ఛైర్లు, ఎంఆర్ కిట్లు, చంక కర్రలు అందజేస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే వారు లబ్ధిదారుని ఆధార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు, రెండు ఫొటోలు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఫోన్ నెంబరు వెంట తీసుకురావాలని, భోజన సదుపాయం కల్పించినట్టు చెప్పారు.

దివ్యాంగ చిన్నారులకు వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు అందజేసేందుకు సమగ్రశిక్ష–విద్యాశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కేవీ గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఈనెల 11న గురువారం ఉదయం 10 గంటలకు నిడదవోలు జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో వైద్యపరీక్షల నిర్ధారిత క్యాంపు జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి వచ్చే దివ్యాంగ చిన్నారులకు సంబంధించి ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, యూడీఐడీ కార్డు, రెండుపాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని ఆయన పేర్కొన్నారు.

గర్భిణులకు ఉచిత వైద్యం



పెరవలి పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యం అందిస్తున్న డాక్టర్ అమృత

పెరవలి: పేద మహిళల కోసం ప్రభుత్వం అందించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెరవలి పీహెచ్‌సీ వైద్యులు ఆర్‌ఎస్ఎస్‌వి ప్రసాద్ తెలిపారు. పెరవలి పీహెచ్‌సీలో మంగళవారం తణుకుకు చెందిన రత్నా నర్సింగ్ హోమ్‌కు చెందిన వైద్యురాలు వల్లూరి అమృత 35 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ అందరూ ప్రేవేట్ వైద్యం చేయించుకోలేని కారణంగా పేదలకు ప్రతి వారం ఉచితంగా సేవలు అందిస్తున్నానని వీటిని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, అర్చకులు తదితరులు

నిడదవోలు: మండలంలోని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్న దసరా వేడుకల వాల్ పోస్టర్లను మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దసరా వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు సక్రమంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు (ఉండ్రాజవరం): విద్యార్థిని అదృశ్యంపై ఉండ్రాజవరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఏలుబడి మోషయ్య కుమార్తె శ్రావణి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. మోషయ్య చేపలు పట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన భార్య స్థానిక వృద్ధాశ్రమంలో పని చేస్తోంది. ఆమె రోజూ ఉదయం 8 గంటలకు పనికి వెళ్లి తిరిగి 9.30 గంటలకు ఇంటికి వస్తుంది. ఇదే క్రమంలో సోమవారం ఆమె పని నుంచి తిరిగి వచ్చే సమయానికి కూతురు ఇంట్లో లేక పోవడంతో సాయంత్రం వరకు చుట్టుప్రక్కల గాలించారు. బాలిక ఆచూకి తెలియకపోవడంతో తండ్రి మోషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డి.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ర్యాలీలో పాల్గొన్న మూడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు



ఆర్డీవో కార్యాలయంలోనికి వెళ్లకుండా నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



రైతులకు యూరియా అందించాలని నినాదాలు చేస్తున్న నాయకులు



కొవ్వూరు తరలివెళ్తున్న దేవరపల్లి మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు

దగా పాలనపై అన్నదాత పోరు

- కూటమి అన్యాయాలపై రోడ్డెక్కిన రైతన్నలు
- అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ నాయకులు
- పోలీసుల బెదిరింపులకు వెనుకాడని అన్నదాతలు



వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తానేటి వనిత, తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు

దేవరపల్లి: యూరియా కొరత, టమోటా, ఉల్లి పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, కూటమి నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం క్లస్టర్ పరిధిలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు మూడు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున అన్నదాత పోరు చేపట్టారు. రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆర్డీవో కార్యాలయాలకు నిరసన ర్యాలీలగా వెళ్లారు. అనంతరం ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం రైతులకు కనీసం ఒక యూరియా బస్తాను అందించడంలో విఫలమైందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత పోరును విఫలం చేసేందుకు గత రాత్రి నుంచే ప్రభుత్వం పెద్ద ఎత్తున్న ప్రయత్నించింది. పార్టీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఇళ్లకు పోలీసులు వెళ్లి అనుమతి లేదని నోటీసులు ఇచ్చారు. అనుమతి లేని కార్యక్రమంలో పాల్గొంటే కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు ఖాతారు చేయకుండా నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

తాళ్లపూడి(కొవ్వూరు): చంద్రబాబు ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు, కొవ్వూరులో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోవడంపై రైతన్నకు బాసటగా వైఎస్సార్ సీపీ చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, తానేటి వనిత, జి.శ్రీనివాస నాయుడు, నియోజకవర్గ పరిశీలకురాలు గిరిజాల బాబుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులు ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. స్థానిక మెరక వీధి వాటర్ ట్యాంక్ నుంచి బస్టాండ్ సెంటర్, మెయిన్ రోడ్డు, విజయవిహార్ సెంటర్, ఎల్ఐసీ ఆఫీస్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ప్లకార్డులు, పార్టీ జెండాలను పట్టుకుని, నమూనా యూరియా బస్తాలతో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. రైతులకు యూరియా అందజేయాలని రైతులను ఆదుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న రైతుల వ్యతిరేక విధానాలను తప్పుబట్టారు. మార్గ మధ్యలో వైఎస్సార్, అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ తదితర విగ్రహాలకు పూల మాలలు వేశారు. అధిక సంఖ్యలో వచ్చిన పార్టీ శ్రేణులకు అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. కేవలం 50 మంది మాత్రమే వెళ్లాలని డీఎస్పీ, పట్టణ సీఐ, పోలీసులు తదితరులు ఆంక్షలు పెట్టారు. కోఆర్డినేటర్లు అంతా కలిసి ఆర్డీవో కార్యాలయంలో ఏవోపి అచ్యుతకుమారికి వినతి పత్రాన్ని అందజేశారు.

● ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ పంటకు గిట్టుబాటు కావడం లేదని, తమ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు అందించామన్నారు. రైతు వ్యతిరేక విధానాలపై రోడ్డెక్కిన అన్నదాతలపై ప్రభుత్వం నియంతృత్వంగా వ్యహరిస్తుందన్నారు. యూరియా కొరత అని మాట్లాడినా, యూరియా అందజేయాలని కోరినా వారి పై కేసులు పెడతామని సీఎం అనడం సరికాదన్నారు.

● తలారి వెంకట్రావు మాట్లాడుతూ చంద్రబాబు రైతులు పంటలు వేయవద్దు, అవి గిట్టు బాటు కావు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు దివంగత వైఎస్సార్, ఆయన తనయుడు రైతులకు పంటలు వేయడానికి అనేక పథకాలు అమలు చేసారని గుర్తు చేశారు. నాడు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి దేశానికి వెన్నెముఖ రైతు అని భావించి పాలన చేసారన్నారు. బ్లాక్ మార్కెట్ లేకుండా చూడాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని రైతుల పక్షాన కోరారు.

● శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ రైతులు పడే ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. గత రెండు మూడు నెలలుగా యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నా, సమయానికి ప్రభుత్వం యూరియా అందజేయక పోవడంతోనే నేడు రైతులు రోడ్డెకాలసిన పరిస్థితి నెలకొందన్నారు. గతంలో పంట నష్టం జరిగే వెంటనే ఆ సీజన్‌లో నష్ట పరిహారాన్ని వెంటనే అందించే వారని నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమని రమేష్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పట్టణ, మండల అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, వెంపటి సురేష్, ముట్టా వెంకట్రావు, కామిశెట్టి సత్యనారాయణ, అయినీడి పల్లారావు, ఎంపీపీ లు జొన్నకూటి పోసిరాజు, మట్టా వీరాస్వామి, కేవకే దుర్గారావు, కార్పెర్ల ప్రసాద్, ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, కొమ్మిరెడ్డి పశురామారావు, పిట్టా శ్రీనివాస్, పరిమి సోమరాజు, జుట్టా ఏడుకొండలు, సుంకర సత్యనారాయణ, గంధం సాయి, వల్లభశెట్టి శ్రీనివాస్, సిర్రా గంగారావు, ఏలూరి విజయలక్ష్మి, బోడసింగి తులసి, వీర్లా శ్రీహరి పద్మ, గన్నమని జనార్ధన రావు, వెలగ శ్రీరామ్ మూర్తి, కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహ్మణ్యం, వెలగన పోలయ్య, సాగర్, యాళ్ల రామారావు, కొండనల్లి శ్రీనివాస్, రుత్తల భాస్కర్, మూడు నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల నాయకులు, పార్టీ శ్రేణులు హాజరయ్యి రైతుల తరపున గళం విప్పారు.

ఎరువుల వినియోగం తగ్గించేలా చర్యలు



ఎరువుల పంపిణీపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

దేవరపల్లి: ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువుల వినియోగంపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి వ్యవసాయాధికారులను ఆదేశించారు. మండలంలోని గౌరీపట్నం సొసైటీ పరిధిలో ఉన్న యూరియా, ఇతర ఎరువుల నిల్వలను మంగళవారం కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ..జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరం మేరకు నిల్వలు ఉన్నాయని ఆమె తెలిపారు. రబీ పంటకు కూడా కొంత మంది రైతులు ఇప్పుడే యూరియాను కొనుగోలు చేసి సిద్ధం చేసుకుంటున్నారని అలా చేయడం వల్ల కృతిమ కొరత ఏర్పడుతుందని, ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఎకరానికి ఎన్ని బస్తాలు యూరియా వేస్తున్నారని రైతులను కలెక్టర్ ప్రశ్నించగా నాలుగు బస్తాలు వాడుతున్నట్టు ఒక రైతు చెప్పడంతో మోతాదుకు మంచి ఎందుకు వేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. భూమిలో సారంలేక దిగుబడులు పెరుగుతాయనే ఆశతో ఎరువు ఎక్కువ మోతాదుతో వేస్తున్నట్టు కొలు రైతులు వివరించారు. ఈ పంట నమోదు ప్రకారం యూరియా, ఇతర ఎరువులను ఎప్పటికప్పుడు సరఫరా చేస్తామని, డీసీఎంఎస్, సొసైటీలు, ప్రవేటు డీలర్ల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో 27 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరుగుతుండగా 1,790 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 1,690 మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేసామన్నారు. ప్రస్తుతం డీసీఎంఎస్, సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్ద సుమారు 70 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, సొసైటీ త్రి మెన్ కమిటీ ఛైర్‌పర్సన్ ఆండ్రు అనిల్, రైతులు పాల్గొన్నారు.

కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడదవోలు రూరల్: రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన 'అన్నదాత పోరు' నిరసన కార్యక్రమానికి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు మంగళవారం భారీగా తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెలగన పోలయ్య, నాయకులు గజ్జరపు శ్రీరమేష్, కస్తూరి సాగర్, యాళ్ల రామారావు, తిరుమళ్ల దుర్గారావు, కొండపల్లి శ్రీనివాస్, పులుమంతుల రామారావు, కొప్పుల రామదేవుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు, రైతుల తరపున గళాన్ని వినిపించేందుకు తరలివెళ్లారు.

దేవరపల్లి: యూరియా ఎరువు బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమానికి మాజీ హోంమంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు భారీగా తరలివెళ్లారు. ఉదయం 10 గంటలకు నల్లజర్ల నుంచి కార్లతో ర్యాలిగా దేవరపల్లి, ద్వారకాతిరుమల, గోపాలపురం, నల్లజర్ల మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తానేటి వనిత నాయకత్వంలో భారీగా తరలివెళ్లారు. నల్లజర్ల మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహమణ్యం, ద్వారకాతిరుమల మండల పార్టీ అధ్యక్షుడు ప్రతాపనేని వాసుబాబు, దేవరపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గోపాలపురం మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అన్నదాత పోరుకు తరలివెళ్లి నిరసన గళం వినిపించారు.

యూటీఎఫ్ రణభేరి వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నిడదవోలు: ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఏపీ ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 19 వరకు జరగనున్న వివిధ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని యుటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం రణభేరి వాల్ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ ఐదు ప్రాంతాల నుంచి రణభేరి జాతాలు ప్రారంభమవుతాయన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ విధానాలతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోతుందన్నారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా సంఘాలను కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అయినాల శ్రీనివాసరావు, కార్యదర్శి కె.ప్రదీప్ కుమార్, గౌరవాధ్యక్షుడు ఆకాశపు శ్రీనివాసరావు, కోశాధికారి జి.శివకుమార్, కరుణ్, రేఖా శ్రీనివాసరావు, శ్రీరామ్, రమేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి



కార్డుల పంపిణీపై సమీక్ష చేస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్, అధికారులు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు రూరల్: నియోజకవర్గ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నూరుశాతం పూర్తిచేయాలని తహసీల్దార్ బి.నాగరాజునాయక్ ఆదేశించారు. మంగళవారం 'సాక్షి'లో స్మార్ట్ కార్డు తిప్పలు అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి వెంటనే అధికారులు స్పందించారు. మండలంలోని సమిశ్రగూడెం సచివాలయాల సిబ్బందితో స్మార్ట్ కార్డుల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల కోసం ఎవరూ సచివాలయాలకు రావొద్దని సూచించారు. లబ్ధిదారుల ఇంటికే రేషన్‌డీలర్లు, వీఆర్వో, సచివాలయ సిబ్బంది వచ్చి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీఎస్‌వీఎల్ జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్‌లై డీటీ ఎం.అనిల్‌కుమార్, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వో ఎం.వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా వాడకం అనర్థం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న రాజారావు

నిడదవోలు (ఉండ్రాజవరం): స్థానిక వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామ సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు అధిక మోతాదులో యూరియా వాడకంపై కలిగే అనర్థాలపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ గ్రామంలో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలు రైతులకు అధిక యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలపై వివరించాలన్నారు.

ఎరువుల వినియోగంతో నేల నిస్సారమే!

నల్లజర్ల: అధిక దిగుబడుల కోసం రైతులంతా రసాయన ఎరువులు విరివిగా వినియోగిస్తున్నారని ఫలితంగా భూములు నిస్సారంగా మారే ప్రమాదముందని మండల వ్యవసాయాధికారి బి.సోమశేఖరం మహిళా రైతులకు సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో డ్వాక్రా సంఘ సభ్యులకు మంగళవారం సాయంత్రం రసాయన ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాధారణ యూరియా ఎకరానికి 2,3 బస్తాలు వినియోగించాలి. అదే నానో యూరియా 500గ్రాములు సరిపోతుందన్నారు.

పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుంది



పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న సిబ్బందిని సన్మానిస్తున్న డాక్టర్ రామగురెడ్డి తదితరులు

అనపర్తి: బాధ్యతగా అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి పదోన్నతి గౌరవ సూచకమని, దానితోపాటు బాధ్యతను మరింత పెంచుతుందని అనపర్తి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, ఐఎంఏ అనపర్తి శాఖ అధ్యక్షుడు డాక్టర్ తాడి రామగురెడ్డి అన్నారు. అనపర్తి ఏరియా హాస్పిటల్‌లో పని చేస్తున్న పదోన్నతి పొందిన, ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న వైద్యులు, సిబ్బందికి సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతిపై రామచంద్రాపురం ఏరియా ఆస్పత్రికి బదిలీపై వెళ్లిన దంత వైద్య నిపుణులు డాక్టర్ సీహెచ్ఎస్ భాగ్యలక్ష్మి, కొవూరుకు బదిలీ అయిన డాక్టర్ ఎం.వాణి, హెడ్ నర్సులు విమలకుమారి, వెంకట రమణలను ఘనంగా సన్మానించారు. సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్, కరుణశ్రీ పాల్గొన్నారు.

ఉచిత బస్సుతో చావే దిక్కు



పెడిమెట్టలో ఆందోళన చేస్తున్న యూనియన్ నాయకులు, డ్రైవర్లు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తాళ్లపూడి: స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టి తమ నోట్లో చంద్రబాబు ప్రభుత్వం మట్టి కొట్టిందని తమకు ఇక చావే దిక్కని ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు వాపోయారు. తాళ్లపూడి మండలంలోని మూడు ఆటో యూనియన్లకు చెందిన ఆటో డ్రైవర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. నవ చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు హనుమంతు, న్యూ యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షుడు కడుగుల రజని కుమార్, గోదావరి న్యూ చైతన్య ఆటో యూనియన్ అధ్యక్షుడు తమిర్చి మధు బాబులు అధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో 270 మందికి పైగా ఆటో డ్రైవర్లు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయంలో రామకృష్ణకు అందజేశారు. అనంతరం పైడిమెట్ట జంక్షన్‌లో వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఉచిత బస్సు పథకంతో తమకు జీవనోపాధి లేకుండా నోటి దగ్గర కూడు లాగేసుకుందని ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం లాగా ఆటో డ్రైవర్లకు జీవనభృతి పేరుతో నిధులు ఏర్పాటు చేయాలని, లేదంటే తమకు చావే దిక్కని, ఆదాయం ఎలానూ లేదు కనీసం తమ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మండలంలోని పంగిడి వద్ద ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు ఆందోళన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొని నిరసన తెలిపారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చాగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం వలన ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నామని ఆదుకోవాలని కోరుతూ మంగళవారం జై విజయదుర్గ ఆటో ఓనర్స్ అండ్ ఆటో డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చాగల్లు మెయిన్‌రోడ్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.మెరికమ్మను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్ బేగ్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంలో ఉచిత బస్సు వలన ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని, కార్పొరేషన్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఊనగట్లకు చెందిన ఆటో యూనియన్ నాయకుడు పుల్లూరి సత్యన్నారాయణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిస్థితి బాగోలేదని అప్పులు పాలై ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కంచుమర్తి ధర్మరాజు, అంజిత్ శ్రీనివాసరావు, మల్లుల మల్లిఖార్జున రావు, కంచుమర్తి సుబ్రహ్మణ్యం, ఇరుగుల గోపి తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై తిరుమలకు యాత్ర

దేవరపల్లి: కడియం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది గోవింద స్వాములు తిరుమలకు సైకిల్‌పై మంగళవారం యాత్రను ప్రారంభించారు. యాత్ర మండలంలోని యర్నగూడెం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నాటికి తిరుమల చేరుకుని మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. నిడదవోలు–యర్నగూడెం గ్రామాల మధ్య సుమారు 15 కిలో మీటర్లు రోడ్డు దారుణంగా ఉందని స్వాములు వాపోయారు.

ఐటీఐ అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆధ్వర్యంలో పరిశ్రమల్లో శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా పేపర్ మిల్ లిమిటెడ్ రాజమహేంద్రవరం యూనిట్‌లో ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఇనిస్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, సివిల్ అభ్యర్థులకు అవకాశం ఉందన్నారు. స్టైఫండ్ రూ.8,050 ఇస్తారన్నారు. శ్రీసిటీలో బ్లూస్టార్ లిమిటెడ్‌లో ఐటీఐ ఆర్అండ్ ఏసీ, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ అభ్యర్థులకు, స్టైఫండ్ రూ.12,500 ఇస్తారన్నారు. చక్రద్వారబంధం ఐడీఈఎఫ్‌లో ఐటీఐ ఫిట్టర్, వెల్డింగ్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. స్టైఫండ్ రూ.10 వేలు ఇస్తారన్నారు. అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికెట్ కాపీలు, ఆధార్ సీడింగ్‌తో బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఒక పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటో, పాన్‌కార్డును ఈనెల 25లోపు ప్రభుత్వ ఐటీఐ, కలెక్టరేట్ వెనుక, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం అడ్రస్సులో సమర్పించాలన్నారు. పరీక్ష తేదీ, ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు.